భోంచేసి రూమ్‌కెళ్ళి కూర్చున్నాడు మధుకర్ . స్టాఫ్ ఇంటర్వ్యూలు, అపాయింట్‌మెంట్లుతో గత మూడ్రోజులనుంచీ చాలా 'బిజీ'గా వున్నాడు మధుకర్ .

రేపట్నించి ఆఫీస్ కొత్త 'స్టాఫ్'తో కళకళలాడుతుంది. తన స్వంత ఆఫీసులో ..... తన స్వంత స్టాఫ్ ..... మనసులో తొంగి చూస్తున్న ఆనందాన్ని తట్టుకోలేకపోతున్నాడతను.

ఏదో ఆలోచిస్తున్న మధుకర్ చూపు కేలండర్ మీద పడింది.

ఆ నెలకు ఆ రోజు ఆఖరు రోజు ..... రేపు ఫస్టు ..... అంటే ..... రేపు తను బ్యాంకుకెళ్ళాలి ..... లేచి గబగబా సూట్‌కేస్ తెరిచి చూశాడు.

ఎకౌంట్లో వెయ్యడానికి దాచిన ఎమౌంట్‌ని లెక్కపెట్టాడు.

తొమ్మిదివేల ఏడువందలు .....

ఈ సారి ఎలాగయినా పదివేలు ఎమౌంట్‌లో వెయ్యాలని ఎప్పుడో అనుకున్నాడూ మధుకర్ .

ఆఫీసు డబ్బు ఏభైవేలవరకూ వుంది.

అందులోంచి మూడొందలు తీసుకుంటే .....

మనస్కరించలేదు మధుకర్‌కి. ఆ మూడువందలూ తన స్వంత డబ్బు కావాలి! మహతి ఎకౌంట్లో యెంత డబ్బు వేసిందో? ఆ ఆలోచన రాగానే తను ఎలాగైనా పక్కాగా పదివేలు వెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

చిల్లర, మల్లర కోసం గదిని, జేబుల్నీ వెతికాడు. మరో పైసా ఎక్కడా లేదు. ఏం చెయ్యాలి?

చేతి వాచీవేపు చూసాడు.

పదీ నలభై అయింది. ఏదో ఆలోచనరాగానే, గబుక్కున రూమ్ తాళం వేసి నారాయణగూడా పెట్రోల్ బంక్ దగ్గరకొచ్చాడు.

పెట్రోల్ బంక్ దగ్గర వుండాల్సిన మిత్రుడు లేడు.

ఓనరున్నాడు--

"ఏం మధూ ..... ఏదో స్వయంగా వ్యాపారం చేస్తున్నావటగదా! బాగుందా ..... మీ వాడు ఏదో సినిమా ప్రొడక్షన్ కంపెనీలో ఆఫరొచ్చిందని వెళ్ళిపోయాడు. ఇంకా వారం రోజులు కూడా కాలేదు" చెప్పాడు ఓనర్.

"నైట్ డూటీ ఎవరు చేస్తున్నార్సార్" ఆఫీసు రూంలో తన స్థానంలో కూర్చున్న కొత్త వ్యక్తిని చూస్తూ అడిగాడు మధుకర్ .

"ఇలాంటి ఉద్యోగాల్లో  ఎవరు పర్మినెంట్‌గా వుంటారు చెప్పు" అన్నాడు ఓనర్.

ఆ రాత్రికి తనక్కడ ఓవర్‌టైమ్ చేద్దామని వచ్చాడు మధుకర్ . ఏం చెయ్యాలో పాలు పోలేదు.

"ఏం మధూ, సిన్మాకెళ్ళొస్తున్నావా" మళ్ళీ అడిగాడు ఓనర్.

"లేదు సర్ ..... ఎవరూ లేకపోతే ఓవర్ టైమ్ చేద్దామని వచ్చాను" నెమ్మదిగా అన్నాడు మధుకర్ .

"ఓవర్‌టైమా? మరి బిజినెస్సేదో ..... " మధుకర్ పద్ధతి ఆయనకేం అర్థంకాలేదు.

"ఇబ్బందు లుంటాయికదా సర్ ."

బంక్ ఓనర్ ఆలోచనలో పడ్డాడు.

"ఓ పని చేస్తావా మధూ ..... వనస్థలిపురం రోడ్‌లో మన డే అండ్ నైట్ రెస్టారెంట్ వుంది చూశావా ..... అక్కడకెళ్తావా ..... ఇవాళ మేనేజర్ సెలవుపెట్టాడు. ఇప్పటివరకూ అక్కడే వున్నాన్నేను. నువ్వు వెళ్తానంటే ..... నేను హాయిగా ఇంటికెళ్ళిపోతాను" చెప్పాడాయన.

"వెళ్తాను ..... సర్ ..... "

ఠక్కున అన్నాడు మధుకర్ .

"నేను ఎయిటో క్లాక్‌కి వస్తాను ..... నేనొచ్చి నిన్ను పంపించేస్తాను"

మరో పది నిమిషాల తర్వాత వనస్థలిపురం వెళ్ళే బస్సెక్కాడు మధుకర్ .

ఇరవై నిమిషాల తర్వాత డే అండ్ నైట్ రెస్టారెంట్లో వున్నాడు.

సుదూర ప్రాంతాలనుంచి రాత్రివేళ వచ్చే ప్రయాణీకుల కోసం పంజాబీధాబాల టైపులో ఏర్పాటుచేసిన రెస్టారెంట్ అది.

ముగ్గురు సర్వర్లున్నారు.

ఎక్కువగా అక్కడకు లారీ డ్రైవర్లు వస్తారు- రహస్యంగా డ్రింకుని కూడా అక్కడ సర్వ్ చేస్తారు.

రెండుగంటలు గడిచాయి.

కౌంటర్లో ఒకచోట లైటు వెలుగుతోంది. మిగతా అంతా చీకటి. సర్వర్లు కునికిపాట్లు పడుతున్నారు అప్పుడే  మూడు లారీలు వెళ్ళి పోయాయి. మళ్ళీ లారీలొచ్చేంతవరకూ రెస్టారెంట్ కూడా నిద్రపోతుంది.

కౌంటర్‌మీద తలవాల్చి నిద్రపోతున్నాడు మధుకర్ .

ఏదో కారు హారన్ శబ్దం వినబడ్డంతో గబుక్కున మెలుకువొచ్చింది మధుకర్‌కి.

కారులోంచి ఓ వ్యక్తి దిగిరావడం, రెస్టారెంట్ సర్వర్ గబగబా ఎదురెళ్ళి "ఏం కావాలిసర్ ..... " అని అడగడం అంతా చీకట్లో మసక మసగ్గా కనిపిస్తోంది మధుకర్‌కి.

"కూల్‌డ్రింక్స్ ఉన్నాయా ..... "

"లేవు సర్ ..... అయిపోయాయి ..... "

"షోడా ..... "

"లేవు సర్ ..... "

"మంచినీళ్ళు ..... కూడా అయిపోయాయా ..... " అవతలి వ్యక్తికి బాగా దాహంగా ఉందన్న విషయం ఆ మాటల్లోనే తెలుస్తుంది.

సర్వర్ గబగబా లోనికొచ్చి, సత్తుగ్లాసుతో నీళ్ళు పట్టుకెళ్తున్నాడు. అంతవరకూ రోడ్డువారగా నిల్చున్న ఆ వ్యక్తి రెస్టారెంట్ అరుగుమీదకి రావడంతో-

మసక వెలుతురులో ఆ వ్యక్తిని స్పష్టంగా చూశాడు మధుకర్ .

రాఘవేంద్రనాయుడు !

ఇంత రాత్రి, తన తండ్రి, డ్రైవర్ కూడా లేకుండా ..... ఊరుచివర గెస్ట్‌హౌస్‌లో ఇంపార్టెంట్ బిజినెస్ పీపుల్ వచ్చినపుడు వాళ్ళతో పాటు సరదాగా పార్టీలో గడిపి రావడం తెలుసు ..... మధుకర్‌కి.

ఆత్రంగా పరుగెట్టి, సర్వర్ చేతిలోని గ్లాసుని తను అందుకుని ముందుకెళ్ళాడు మధుకర్ .

బాగా అలిసిపోయి ఉన్నట్టున్నాడు. నీళ్ళను అందుకుని గబగబా తాగేశాడు.

"ఒన్ మోర్ ప్లీజ్ ..... " ఇంకో గ్లాసుతో తెచ్చిస్తే, ఆ నీళ్ళూ తాగేశాడు. అప్పుడు గమనించాడు మధుకర్ .

తండ్రి దగ్గర్నించి చిన్నగా డ్రింక్ వాసన వస్తోంది. డ్రైవర్‌ని తీసికెళ్ళకుండా తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాడంటే, చాలా ఇంపార్టెంట్ మీటింగన్నమాట!

ఈ పరిస్థితిలో ఇంటికి డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళగలరా?

ఏం చెయ్యాలో అర్థంకాలేదు మధుకర్‌కి.

"థాంక్యూ"

చెప్పేసి, కారువేపు వెళుతున్న తండ్రి వెనకే వెళ్ళాడు మధుకర్ . కారు డోర్ తియ్యడానికి రాఘవేంద్ర నాయుడు ఇబ్బంది పడడం గమనించాడు.

అప్పటికప్పుడే ఓ నిర్ణయానికొచ్చాడు మధుకర్ .

బాక్ డోర్ తెరచి--

"మీరు కూర్చోండి సర్ ..... నేను డ్రైవ్ చేస్తాను ..... "

మరో మాట మాట్లాడకుండా, బాక్ సీటుకి జారబడిపోయాడు రాఘవేంద్ర నాయుడు .

డ్రైవింగ్‌సీటులో కూర్చుని, కారు స్టార్ట్ చేశాడు మధుకర్ .

"డ్రైవర్ ..... ఇవాళ కొంచెం ..... డ్రింక్ ఎక్కువయింది కదూ ..... " తనలో తాను అనుకున్నట్టుగా అన్నాడు రాఘవేంద్ర నాయుడు .

మధుకర్ ఏం మాట్లాడలేదు.

మరో అరగంట తర్వాత, కారు ఇంటిముందు ఆగింది. వాచ్‌మెన్ గేటు తెరిచాడు.

"వాచ్ మెన్ ..... అయ్యగారిని లోనికి తీసికెళ్ళు ..... "

మధుకర్ ఆ మాటంటున్న సమయంలోనే, పోర్టికోలో లైటువెలగడం, తల్లి భువనేశ్వరీదేవి తలుపు తెరచుకొని బయటకు రావడం జరిగింది.

ముఖం చాటుచేసుకుందామన్నా మధుకర్ ప్రయత్నం విఫలం అయిపోయింది.

అక్కడ-- ఆ సమయంలో -- అలా -- మధుకర్ ..... కన్పిస్తాడని ఊహించలేదు భువనేశ్వరీదేవి.

"బాబూ ..... మధూ ..... "

అప్పటికే రాఘవేంద్ర నాయుడు లోనికెళ్ళిపోయాడు.

"బాబూ ..... బాగున్నావా ..... రా ..... లోనికి రా ..... " ఆప్యాయంగా పిలిచింది తల్లి.

వాళ్లిద్దరి మధ్యా ఉన్నది కొన్ని నెలల ఎడబాటే అయినా, ఎన్నో ఏళ్ళ అంతరంలా ఉందామెకు.

ఎన్నోసార్లు కొడుకుని బాగా తాగున్న పరిస్థితిలో ఎవరో తీసుకురావడం తెల్సు.

అలాంటి కొడుకు, తన తండ్రిని తీసుకొచ్చాడు. అదే ఆశ్చర్యంగా ఉందామెకు. కొడుకు ఆకారంలోను, ప్రవర్తనలోనూ ఏదో మార్పు కొట్టవచ్చినట్టు కనిపించింది.

"లోనికిరా ..... మధూ ..... ఇది నీ ఇల్లు ..... "

"వస్తానమ్మా ..... మూడు నెలల తర్వాత వస్తాను ..... నా ఇంటికి తీసికెళతాను ..... "

"అదేమిట్రా ..... ఏదో తగువులాడుకున్న వాళ్ళలా ప్రవర్తిస్తావేం ..... "

" కొన్ని నియమాలు అంత పకడ్బందీగా లేకపోతే లక్ష్యం చేరుకోలేం ..... "

"నాన్న ఈ మధ్య ఎక్కువ పార్టీలకెళుతున్నట్టున్నారు ..... తగ్గించమని చెప్పు ..... వస్తాను ..... " వెనుతిరిగాడు మధుకర్ .

ఆ తల్లి మరేం మాట్లాడలేకపోయింది.

* * *

తనని రాత్రి ఇంటిలో డ్రాప్ చేసినవాడు తన కొడుకు మధుకర్ అని తెలియగానే అంతటి కోటీశ్వరుడూ తనలో తాను కుంచించుకుపోయాడు.

రోడ్డుపక్క కాకా హోటల్లో పని చేస్తున్నాడా మధుకర్ !

అప్పుడు సమయం ఏడుగంటలైంది. నైట్‌డ్రెస్‌లో ఉన్నాడు. రాఘవేంద్ర నాయుడు . అప్పుడే భార్య బెడ్‌కాఫీ తీసుకొచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"ఇప్పుడే వస్తాను ..... " గబుక్కున లేచాడు రాఘవేంద్ర నాయుడు . గబగబా మేడ మెట్లు దిగి పోర్టికోలోకొచ్చి కారులో ఎక్కి కూర్చున్నాడు.

* * * *

"నీకెప్పుడయినా ఓవర్ డ్యూటీ చెయ్యాలని పించిందనుకో ..... ముందుగా నాతో చెప్పక్కర్లేద్దు ..... ఇక్కడకొచ్చెయ్ ..... ఓపెన్ ఆఫర్ నీకిస్తున్నాను ..... ఎందుకోతెల్సా ..... నీలా కష్టపడాలనుకునేవాళ్ళంటే ..... నాకిష్టం ..... " జేబులోంచి డబ్బు తీసిస్తూ అన్నాడు ఓనర్.

అవి ముప్పై రూపాయలు-- తనకి కావల్సింది మూడొందలు.

"కంటిన్యూగా పది రోజులు వర్క్ చేస్తాను సార్-- కొంచెం అవసరం ..... " మధుకర్ మాటల్ని మింగేశాడు. ఓనర్ మరేం మాట్లాడలేదు. జేబులోంచి మూడువందలు తీసిచ్చి--

"ఇబ్బందులు ఎవరికయినా ఉంటాయ్ ..... " అని మాత్రం అన్నాడు.

మూడు వందలు

తన కష్టార్జితం ఆ మూడు వందలు--

పది రాత్రుల నిద్రలేమి ఖరీదు మూడు వందలు.

"థాంక్యూ సర్ ..... " ఓనరుతో చెప్పి, బస్టాపులోకొచ్చి నిల్చున్నాడు మధుకర్
.

అప్పుడతను-- అనుకున్న పదివేలు, బ్యాంక్‌లో వెయ్యగలుగుతున్నాననే ఆనందంతో ఉన్నాడు.

*   *   *   *

మధుకర్ వెళ్ళిపోయిన పది నిమిషాలకు--

రాఘవేంద్ర నాయుడు కారు అక్కడకొచ్చి ఆగింది. రాఘవేంద్ర నాయుడుని చూసి, ఓనరు నిర్ఘాంతపోయాడు.

పరుగు పరుగున వెళ్ళాడతను.

"ఏం కావాలి సర్ ..... "

"ఇక్కడ ..... మధుకర్ ..... "

"మధు ..... మధుకర్ ..... మధుకర్‌గారా సర్ ..... వెళ్ళిపోయారు సర్" ఓనరు ఉద్వేగాన్ని అణుచుకుంటూ అన్నాడు.

" మధుకర్ ..... ఇక్కడ పనిచేస్తుంటాడా ..... "

"ప్రస్తుతం చెయ్యడం లేదు సర్ ..... ఇదివరలో ..... " చెప్పాడు ఓనర్.

"మళ్ళీ వస్తాడా ..... "

"నైట్‌డ్యూటీ చెయ్యడానికి వస్తానని  చెప్పారు సర్ ..... "

"ఓ పని చెయ్యండి ..... " అంటూ జేబులోంచి కొత్త కరెన్సీ నోట్ల కట్టను తీసి, ఓనరు చేతిలో పెడుతూ --

“అతను ఈసారి మీ దగ్గరకు ఏ అవసరం కోసమొచ్చినా నువ్విచ్చినట్టుగా ఈ డబ్బు ఇవ్వు” అన్నాడు నాయుడు.

“అలాగే సర్!”

రాఘవేంద్ర నాయుడు కారెక్కాడు. కారు సర్రున ముందుకు దూసుకుపోయింది. కారులోంచి రోడ్డు మలుపులో నున్న బస్టాపువేపు రాఘవేంద్ర నాయుడు చూస్తే-- మధుకర్ కనిపించి వుండేవాడు.

అప్పుడే వచ్చి ఆగిన సిటీబస్సులోకి ఎక్కాడు మధుకర్ .

*　　　　*　　　　*　　　　*

మోహదీపట్నం --
స్టేట్‌బ్యాంక్‌లో--
బ్రాంచ్ మేనేజర్ కెదురుగా కూర్చుంది మహతి .